# నేటి నిజం

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com తెలుగు దినపత్రిక

హైదరాబాద్ శుక్రవారం 3-12-2021 RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 99 పేజీలు:4 వెల: రూ.1/-


## తెలంగాణకు తప్పిన 'జవాద్' ముప్పు

హైదరాబాద్, డిసెంబర్ 2: రాష్ట్రానికి జవాద్ తుఫాను ముప్పు తప్పింది. జవాద్ తుఫాన్ ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా, పశ్చిమబెంగాల్ వైపు వెళ్లే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం లేదని స్పష్టం చేశారు. తుఫాను కారణంగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయని పేర్కొన్నారు. ఆకాశం మేఘావృతమై ఉంటుందని చెప్పారు. ఉత్తర ఈశాన్య దిశగా జవాద్ తుఫాన్ వెళ్లనుందని, థాయిలాండ్ పరిసర ప్రాంతాల్లో రెండు రోజుల కిందట ఏర్పడిన అల్పపీడనం గురువారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో తీవ్ర అల్పపీడనంగా మారి ఆగ్నేయ బంగాళాఖాతం పక్కనే ఉన్న అండమాన్ సముద్ర పరిసర ప్రాంతాల్లో కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అల్పపీడనానికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం మధ్యస్థ ట్రోపోస్ఫియర్ స్థాయి వరకు వ్యాపించి ఉందని పేర్కొన్నది. తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయువ్యదిశగా కదిలి శుక్రవారం ఉదయంలోగా అండమాన్ సముద్ర పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని తెలిపింది. ఆ తర్వాత 24 గంటల్లో తుఫానుగా మారి శనివారం ఉదయానికి ఉత్తరాంధ్ర- ఒడిశా తీరానికి చేరుకొని, ఉత్తర ఈశాన్య దిశగా వెళ్లే అవకాశం ఉందని పేర్కొన్నది. ఈ తుఫాన్ ఉత్తర ఈశాన్యదిశగా వెళ్లే అవకాశం ఉండడంతో తెలంగాణకు తుఫాన్ ప్రభావం ఉండదని స్పష్టం చేశారు.

# తప్పు చేసినా పశ్చాత్తాపం లేదు.. సస్పెన్షన్ ఎత్తేయాలని డిమాండ్ చేస్తారా?: వెంకయ్య

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:ఎప్పుడు సస్పెన్షన్ జరిగినా సభ్యుల దుష్ప్రవర్తనను ఖండించడం కోసమేనని, సభలో జరిగిన అప్రజాస్వామిక చర్యలను నిరాకరించడం కోసమేనని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. 12 మంది సభ్యుల సస్పెన్షన్ అంశంపై గురువారం ఆయన మాట్లాడుతూ? మూడు రోజులుగా సభ సజావుగా జరగలేదనే విషయాన్ని ప్రస్తావించారు. ప్రజాస్వామ్యం పునాదులుగా దేశ నిర్మాణం జరగాలని రాజ్యాంగం ఏర్పడిందని, ఈ క్రమంలో చట్టసభలకు, సభ్యులకు రాజ్యాంగం కీలక బాధ్యత అప్పగించిందని వెంకయ్య వివరించారు. సస్పెన్షన్‌ను కొందరు సభ్యులు అప్రజాస్వామికం అంటుండడం వల్ల సభను వేదికగా చేసుకుని తన ప్రతిస్పందన తెలియజేస్తున్నానన్నారు.

చరిత్రలో సస్పెన్షన్ అనేది తొలిసారిగా జరగలేదని, 1962 నుంచి 2010 వరకు 11 సార్లు సస్పెన్షన్లు జరిగాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అవన్నీ కూడా అప్రజాస్వామికమేనా? అలా అయితే ఇన్ని సార్లు ఎందుకు పునరావృతమయ్యాయని ఛైర్మన్ ప్రశ్నించారు. సభా కార్యక్రమాలకు అడ్డుపడుతున్నప్పుడు రూల్ 255, 256 ప్రకారం సభ్యులను సస్పెండ్ చేస్తారని, తాజా సస్పెన్షన్ వెనుక కారణమేంటో అందరికీ తెలుసని అన్నారు. వర్షాకాల సమావేశాల్లో చోటుచేసుకున్న ఆ తరహా దుష్ప్రవర్తనను, ఘటనను నేను మళ్లీ గుర్తుచేయాలనుకోవడం లేదని వాపోయారు. సస్పెన్షన్‌ను అప్రజాస్వామికం అంటున్నవారు ప్రజాస్వామ్య దేవాలయ పవిత్రతను ఆ సభ్యులు అవమానించిన తీరు గురించి మాట్లాడ్డం లేదని వెంకయ్య అన్నారు.

దీన్నిబట్టి చూస్తే పవిత్ర సభను అవమానించడం తప్పుకాదు, అలా చేసినందుకు చర్య తీసుకోవడమే అప్రజాస్వామికమనే సందేశాన్ని వారు పంపుతున్నారని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యానికి వీరు చెబుతున్న సరికొత్త నిర్వచనాన్ని దేశ ప్రజలు స్వీకరించరని తాను బలంగా నమ్ముతున్నానని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలోనూ సస్పెన్షన్లు జరిగాయి?. తమ తప్పును గ్రహించిన సభ్యులు క్షమాపణ కోరిన సందర్భాల్లో మధ్యలోనే సస్పెన్షన్ రద్దు చేసిన సందర్భాలు ఉన్నాయని వెంకయ్య గుర్తు చేశారు. కానీ ఈ 12 మంది సభ్యులు ఏమాత్రం పశ్చాత్తాపం లేకుండా వ్యవహరిస్తున్నారని,

ఇలాంటి సందర్భంలో ఏం చేయాలో చెప్పండన్నారు. చేసిన తప్పు గురించి పశ్చాత్తాపం లేదు కానీ సస్పెన్షన్ ఎత్తేయాలని మాత్రం డిమాండ్ చేస్తారా? ఇదే ప్రజాస్వామ్య సూత్రమా? అని ప్రశ్నించారు.

సభ్యులు విచారం వ్యక్తం చేస్తే సస్పెన్షన్ ఎత్తేయడాన్ని పరిగణిస్తామని అధికారపక్ష నేత చెప్పారని, డిప్యూటీ ఛైర్మన్ కూడా ఇరుపక్షాలు కూర్చుని మాట్లాడుకోవాలని సూచించారని ఛైర్మన్ వెల్లడించారు. తప్పు చేయడం మానవ సహజమని, అలాగే వాటిని సరిదిద్దుకోవడం కూడా మనిషి తత్వమని, తప్పును సరిదిద్దుకోను అనడం ఏమాత్రం సమంజసం కాదని హితవు పలికారు. సభ్యులందరూ కూర్చుని తదుపరి ఏం చేయాలో నిర్ణయించాలని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు కోరారు.

## 49 శాతం మంది వయోజనులు పూర్తిగా వ్యాక్సినేట్ అయ్యారు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:దేశవ్యాప్తంగా 49 శాతం వయోజనులకు రెండు డోసుల వ్యాక్సినేషన్ పూర్తి అయ్యిందని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. రెండవ డోసు తీసుకుంటున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు ఆరోగ్యశాఖ కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన చెప్పారు. యురోపియన్ దేశాల్లో కోవిడ్ కేసుల సంఖ్య మళ్లీ పెరిగినట్లు ఆయన తెలిపారు. ప్రపంచంలో దాదాపు 70 శాతం కేసులు అక్కడే ఉన్నట్లు ఆయన వెల్లడించారు. గడిచిన వారంలో కేవలం యూరోప్‌లోనే 70 శాతం కేసులు నమోదు అయినట్లు లవ్ అగర్వాల్ చెప్పారు. ఇండియాలో కేరళ, మహారాష్ట్రలో సగటున పదివేల యాక్టివ్ కేసులు ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇండియాలో నమోదు అవుతున్న కేసుల్లో 55 శాతం ఆ రాష్ట్రాల్లోనే ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

# ఆరుతడి పంటలే వేయండి.. రాజకీయ చీడ కూడా పోతది : సీఎం కేసీఆర్



వనపర్తి, డిసెంబర్ 2 తెలంగాణ రైతులు వరికి ప్రత్యామ్నాయంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న వేరుశనగ, పత్తి, మినుములు, పెసర్లు, శనగలు వంటి పంటల సాగు ద్వారా పంట మార్పిడి విధానాన్ని ఎంచుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. వరి వంటి ఒకే తరహా పంట వేసి ఇబ్బంది పడే కంటే ఇతర పంటల సాగు మీద కూడా దృష్టి కేంద్రీకరించాలని సీఎం పేర్కొన్నారు.

గురువారం జోగులాంబ గద్వాల్ జిల్లాకు వచ్చిన సీఎం కేసీఆర్ హైదరాబాద్ వెళ్తూ.. ఆకస్మికంగా మార్గమధ్యంలో వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపూర్, కొత్తకోట మండలం విలియం కొండ తండా గ్రామ పంచాయతీ ఫరిధిలోని రైతులు సాగు చేసిన మినుము, వేరుశనగ పంటలను పరిశీలించారు. మొదట రంగాపూర్ దగ్గర ఆగిన సీఎం కేసీఆర్ రోడ్డు నుండి లోపలికి నడుచుకుంటూ వెళ్లి మహేశ్వర్ రెడ్డి అనే రైతు సాగు చేస్తున్న మినుము పంటను, రాములు అనే మరో రైతు సాగు చేస్తున్న వేరుశనగ పంటను పరిశీలించారు.

### మార్కెట్లో ధర ఎంత ఉంది?

మినుములు, వేరుశనగ దిగుబడి ఎంత వస్తుంది? మార్కెట్లో ధర ఎంత ఉంది? ఎన్ని తడులు నీళ్లు పెట్టాలి? అని రైతులను వివరాలు అడిగారు. మినుములు ఎకరానికి 8 నుండి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనీ, కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 6,300 ఉండగా, మార్కెట్‌లో ధర రూ. 8 వేలకు పైనే ఉందని రైతులు వివరించారు. వేరుశనగ 10 నుండి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందనీ, కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 5550 ఉండగా, మార్కెట్‌లో రూ. 7 వేలకు పైనే ఉందని సీఎంకు రైతులు వివరించారు. పంటల మార్పిడి వల్ల భూసారం పెరిగి దిగుబడి బాగా వస్తున్నదని తెలిపారు.

### వరి ధాన్యంతో పాటు వేరుశనగ కాయలను పరిశీలించిన సీఎం

ఆ తర్వాత కొత్తకోట మండలం విలియం కొండ తండా రోడ్డు వద్ద కళ్ళంలో ఆరబోసిన వరి ధాన్యాన్ని సీఎం పరిశీలించారు. గోకరి వెంకటయ్య అనే రైతు వేరుశనగ పంట దగ్గరికి వెళ్లి పరిశీలించారు. సాగు విధానం, దిగుబడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని వేరుశనగ చెట్లను భూమి నుండి తీసి వేరుశనగ కాయలను స్వయంగా పరిశీలించారు. నీళ్లు, కరెంటు పుష్కలంగా ఉండడంతో పంటల దిగుబడి బాగా పెరిగిందని రైతు వెంకటయ్య సీఎంకు వివరించారు.

### కేసీఆర్‌తో ఫోటోలు దిగేందుకు రైతుల ఆసక్తి

ముఖ్యమంత్రి కేసీఆర్ అకస్మాత్తుగా తమ పంట చేలల్లోకి రావడంతో రైతులు, గిరిజనులు సీఎంతో ఫోటోలు దిగడానికి ఆసక్తి చూపించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, జైపాల్ యాదవ్, పట్నం నరేందర్ రెడ్డి, గువ్వల బాలరాజు, హర్షవర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

# పీయూష్ ఒకలా.. కిషన్‌రెడ్డి మరోలా.. స్పష్టత ఇవ్వాలన్న టీఆర్ఎస్ సభ్యులు..




న్యూఢిల్లీ, డిసెంబర్ 2: తెలంగాణలో వడ్ల కొనుగోలుపై స్పష్టత కోసం పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, సురేష్ రెడ్డి తదితరులు గురువారం మీడియాతో మాట్లాడారు. తమ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ఖరీఫ్, రబీలోని పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఎంపీ బడుగుల లింగయ్య చెప్పారు. తమ నాయకుడు ముఖ్యమంత్రి అయ్యాక కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడంతో పాటు 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చామని, అందుకే దిగుబడి పెరిగిందని అన్నారు. తెలంగాణలో 60 లక్షల ఎకరాల్లో సాగు నడుస్తోందని, సుమారు కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ అవసరముందని అన్నారు. ఎప్పటిలాగానే ఎఫ్‌సీఐ ద్వారా కొనుగోళ్లు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వానకాలం ఎంత కొంటారో టార్గెట్ చెప్తే అదే రైతులకు చెప్తామన్నారు. మామూలు బియ్యం ఎంత, ఉప్పుడు బియ్యం ఎంత కొంటారో చెప్పాలని అన్నారు. యాసంగిలో కేంద్ర ప్రభుత్వం కొనను అంటోంది కాబట్టి తాము కూడా కల్లాల వద్ద కొనే పరిస్థితి ఉండదని ఎంపీ లింగయ్య స్పష్టం చేశారు.

కేంద్రానికి స్పష్టత లేక రైతులకు కష్టాలు : సురేష్ రెడ్డి

తమ రాష్ట్ర ప్రజలు బాధ పడుతున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదని ఎంపీ సురేష్ రెడ్డి ఆరోపించారు. ఖరీఫ్, రబీలో పంటల ఖరీదుపై స్పష్టత లేని వైఖరితో రైతులను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. యాసంగి పంట కొంటారా కొనరా..? కొంటే ఎంత కొంటారు..? కొనకుంటే కొనమని చెప్పండన్నారు. కేంద్ర మంత్రులు పీయూష్ గోయెల్ ఒక ప్రకటన చేస్తారు? రాష్ట్రంలో కిషన్ రెడ్డి ఒకటి చెప్తారని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్రం చేసే ప్రకటనను రాష్ట్ర ప్రభుత్వం రైతుల స్థాయికి తీసుకెళ్లి అమలు చేస్తుందన్నారు. తమ డిమాండ్‌ను అంగీకరించలేదు కాబట్టే వాకౌట్ చేశామని ఆయన తేల్చి చెప్పారు.

ఇది గెలుపోటముల సమస్య కాదు-అన్నదాతల సమస్య : కేకే

సభలో వెల్ లోపలకు వెళ్లడం తమకూ బాధాకరమే అయినా రైతుల సమస్య పరిష్కారం కోసం వెళ్తున్నామని రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు వివరించారు. 1.2 కోటి టన్నుల దిగుబడి ఉండగా, అందులో కనీసం ఒక కోటి టన్నులైనా తీసుకోండని కోరుతున్నామన్నారు. కిషన్ రెడ్డితో మాట్లాడగా? ఆయనకు విషయం అర్థమైందని కేకే తెలిపారు. యాసంగిలో బాయిల్డ్ రైస్ వస్తుందని? యాసంగిలో వచ్చేది ఏదైతే అది తీసుకోమని కోరుతున్నామన్నారు. కొనుగోళ్లకు ఒక్కసారిగా ఫుల్‌స్టాప్ పెట్టకుండా కొంత సమయం ఇవ్వమని కేకే కోరారు. యాసంగిలో సేకరణపై స్పష్టత ఇస్తే రైతులు అందుకు తగ్గట్టు పంట సాగు చేస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. ఒడిశా రాష్ట్రం కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటోందని చెప్పారు. హుజురాబాద్‌లో ఓడినందుకే ఇలా ఆందోళన చేస్తున్నామని కొందరంటున్నారని, తాము వంద సీట్లలో గెలిచామని, వాళ్లకు 85 సీట్లలో డిపాజిట్ కూడా రాలేదని ఎద్దేవా చేశారు. ఇక్కడ సమస్య గెలుపోటముల గురించి కాదు. రైతుల గురించని కేకే స్పష్టం చేశారు. ఆందోళనలో భాగంగా 12 మంది ఎంపీల సస్పెన్షన్‌ను కూడా వ్యతిరేకిస్తూ రాజ్యసభ నుంచి వాకౌట్ చేశామని వివరించారు.

## పర్యావరణ కాలుష్యంతో భవిష్యత్ తరాలకు ప్రమాదం : మంత్రి ఐకే రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 2: పర్యావరణ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతుందని దీని వల్ల భవిష్యత్ తరాలు పెను ప్రమాదంలో చిక్కుకునే పరిస్థితులు ఉన్నాయని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సకల సృష్టికి జీవనాధరమైన గాలి, నీరు, ధరిత్రిని కలుషితం చేస్తూ పోతే భవిష్యత్ అంధకారం అవుతుందని తెలిపారు.

ప్రకృతి వనరులను అనుభవిస్తూ పరిరక్షణ బాధ్యతను విస్మరిస్తే జీవుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. ఢిల్లీ లాంటి ప్రధాన నగరాలు వాయు కాలుష్యంతో కొట్టుమిట్టాడుతున్నాయని, కాలుష్య నియంత్రణకు దీర్ఘకాలిక వ్యూహాల అమలుపై కేంద్ర రాష్ట్ర ప్రత్వాలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు.

జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో కాలుష్య నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అడవులను, పర్యావారణాన్ని రక్షించేందుకు తెలంగాణకు హరితహారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్సరాలుగా కోట్లాది మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణ చేపడుతున్నామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పునరుద్ధరణ, మిషన్ భగీరథ స్కీం ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీరు అందిండంతో పాటు పల్లె, పట్టణ ప్రగతాఇ కార్యక్రమాల ద్వారా పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేయేడంతో అనుకున్న ఫలితాలను సాధిస్తున్నామని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి..కాలుష్య కారకాలు, వ్యర్థాల నియంత్రణ నిర్వహణకు సంబంధించిన చట్టాలను, నిబంధనలను తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కఠినంగా అమలు పరుస్తుందన్నారు. పరిశ్రమల్లో కాలుష్యం, ప్రమాదకర పదార్థాలపై నిరంతర పర్యవేక్షిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

## నర్సింహులు కుటుంబాన్ని ఆదుకుంటాం

సిద్దిపేట, డిసెంబర్ 2:: జిల్లాలోని చిట్టాపూర్‌లో టైరు పగిలి వ్యవసాయ బావిలో పడ్డ కారును, అందులోని మృత దేహాలను బయటకు తీసేందుకు వెళ్లి గజఈతగాడు నర్సింహులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. కాగా నర్సింహులు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని సిద్దిపేట ఆర్డీఓ అనంత రెడ్డి తెలిపారు. ప్రభుత్వం తరపున రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను అందిస్తామన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సహకారం కింద రూ. 6 లక్షల పరిహారం అందే అవకాశం ఉంటుందన్నారు. దీనితో పాటు బాధిత కుటుంబానికి తక్షణం డబుల్ బెడ్రూమ్ ఇల్లు కూడా కేటాయిస్తామని అనంత రెడ్డి తెలిపారు.

## తరముకొస్తున్న 'జవాద్' ముప్పు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: జవాద్ తుఫాను తరముకొస్తున్నది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు ముప్పు పొంచి ఉన్నది. శనివారం తెల్లవారు జామున ఈ తుఫాను ఏపీ, ఒడిశా మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలో శుక్రవారం ఒడిశాలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. భారీ వర్షాలు కురువనున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఎట్టి పరిస్థితుల్లో బయటకు రావొద్దని సూచించింది. జవాద్ తుఫాను ముప్పు దృష్ట్యా.. దేశంలో తుఫాను పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

### బెంగాల్‌కు ఎనిమిది ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు

తుఫాను నేపథ్యంలో అధికారులు పశ్చిమ బెంగాల్‌లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను మోహరించారు. అలాగే మరో ఎనిమిది బృందాలను రాత్రి వరకు తరలించనున్నారు. తుఫాను తీరం దాటే సమయంలో ఒడిశాలోని గజపతి, గంజాం, పూరి, జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ మేరకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. శనివారం కేంద్రపారా, కటక్, ఖుర్దా, నయాఘర్, కందమాల్, రాయగడ, కోరాపుట్ జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.

### ఏపీ, ఒడిశా మధ్య తీరం దాటే అవకాశం..

అండమాన్ నికోబార్ తీరం వద్ద ఏర్పడిన అల్పపీడనం కొద్ది గంటల్లో తుఫానుగా మారనున్నది. పశ్చిమ వాయువ్య దిశగా పయనించి డిసెంబర్ 3న ఆగ్నేయ, బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న మధ్య భాగాన్ని చేరుకునే అవకాశం ఉంది. 4న ఉదయం ఉత్తర ఆంధ్రప్రదేశ్-ఒడిశా తీరాన్ని తాకే అవకాశం ఉంది. ఈ సమయంలో ఒడిశా తీర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## డ్రాగన్ క్షిపణి ప్రయోగాలపై అమెరికా ఫైర్!

న్యూయార్క్, డిసెంబర్ 2:: హైపర్‌సానిక్ క్షిపణులను సమీకరిస్తున్న చైనాను అమెరికా ఎండగట్టింది. ఈ తరహా ఆయుధాలతో ఉద్రిక్తతలు పెరుగుతాయని డ్రాగన్‌తో పొంచి ఉన్న ముప్పులను నివారించేందుకు అమెరికా కట్టుబడిఉందని స్పష్టం చేసింది. డ్రాగన్ సమకూర్చుకుంటున్న సైనిక పాటవం, సాధనా సంపత్తితో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెచ్చుమీరతాయని అమెరికా ఆందోళన చెందుతోందని రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ పేర్కొన్నారు.

జులైలో చైనా చేపట్టిన లేటెస్ట్ హైపర్‌సోనిక్ క్షిపణి పరీక్షలపై చర్చ సందర్భంగా ఆస్టిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనా చేపడుతున్న సైనిక సామర్థ్యం పెంపు చర్యలు అమెరికన్ రక్షణ వ్యూహాలకు విసిరే సవాళ్లను ప్రస్తావిస్తూ ఆస్టిన్ స్పందించారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ కాంచించిన ప్రతి పాత్రకు
జీవము నిడి యువనికపయి చెల్లంజేయుచు
దేవుడు సంతోషముతో
దీవించెను యశము నొసగి "దేవానందు"న్ !!

(డిసెంబర్ 3 నటుడు దేవానంద్ జయంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210






# పేదరికంలో భారతం - నిర్మూలించడమే కర్తవ్యం

**(నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన 'జాతీయ బహుమితీయ పేదరిక సూచిక-2021' ఆధారంగా)**

నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన 'నేషనల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్, యంపిఐ (జాతీయ బహుమితీయ పేదరిక సూచిక)' వివరాల ప్రకారం దేశంలోని బీహార్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పేదరికం అధికంగా ఉందనే కఠిన వాస్తవాలు బయట పడ్డారు. వివిధ రాష్ట్రాల పేదరిక సూచిక ప్రకారం అత్యధికంగా బీహార్‌లో 51.91 శాతం, ఝార్ఖండ్‌లో 42.16 శాతం, యూపీలో 37.79 శాతం, యంపీలో 36.65 శాతం, మేఘాలయాలో 32.67 శాతం పేదల జనాభాలో తొలి 5 స్థానాల్లో ఉన్నట్లు వెల్లడైంది. పేదరికం అత్యల్పంగా కేరళలో 0.71 శాతం, గోవాలో 3.76 శాతం, సిక్కిమ్‌లో 3.82 శాతం, పంజాబ్‌లో 5.59 శాతం ప్రజలు మాత్రమే కనిష్ఠంగా పేదరికంలో ఉన్నారని తేలింది. పేదరిక సూచిక పట్టికలో 20వ స్థానంలో 12.31 శాతంతో ఆంధ్రప్రదేశ్, 18వ స్థానంలో 13.74 శాతం పేదరికం, నిలవడం గమనించారు.

'ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిష్యేటివ్'తో పాటు యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' రూపొందించిన మార్గనిర్దేశకాల ప్రకారం భారతదేశంలోని రాష్ట్రాల్లో 'బహుమితీయ పేదరిక సూచీ (యంపిఐ)'లను నిర్ణయించారు. జీవన ప్రమాణాలు, ఆరోగ్యం, విద్య అనబడే అంశాల ఆధారం చేసుకొని పోషకాహారం, బాల కౌమారదశ మరణాల రేటు, మాతాశిశు రక్షణ, పాఠశాల విద్యా సంవత్సరాలు, పాఠశాల హాజరు, వంట ఇంధనం, పారిశుధ్యం, తాగు నీరు, విద్యుత్తు, గృహ వసతి, ఆస్తులు, బ్యాంక్ ఖాతాలు అనబడే 12 ఇండికేటర్స్‌ను ప్రాతిపదికగా తీసుకున్నారు. ఐరాసలోని 193 సభ్య దేశాలు 2015లో తీర్మానించిన 17 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030'లతో పాటు 169 టార్గెట్ల ఆధారంగా పేదరిక సూచీలను నిర్ణయించామని నీతి ఆయోగ్ బాధ్యులు వివరిస్తున్నారు.

## రాష్ట్రాల్లో బహుమితీయ పేదరిక సూచీ:

పేదరిక సూచిక పట్టీలో బీహార్ (51.91 శాతం), ఝార్ఖండ్ (42.16 శాతం), యూపీ (37.79 శాతం), యంపీ (36.65 శాతం),మేఘాలయ (32.67 శాతం), అస్సాం (32.67 శాతం), చత్తీస్‌ఘర్(29.91 శాతం), రాజస్థాన్ (29.46 శాతం), ఒడిసా (29.35 శాతం), నాగాలాండ్ (25.23 శాతం), అరుణాచల్ ప్రదేశ్ (24.27 శాతం),పశ్చిమబెంగాల్ (21.43 శాతం), గుజరాత్ (18.60 శాతం), మణిపూర్ (17.89 శాతం), ఉత్తరాఖండ్ (17.72 శాతం), త్రిపుర (16.65 శాతం), మహారాష్ట్ర (14.85 శాతం), తెలంగాణ (13.74 శాతం) కర్నాటక (13.16 శాతం), ఆంధ్రప్రదేశ్ (12.31 శాతం), హర్యానా (12.28 శాతం), మిజోరాం (9.80 శాతం), పంజాబ్ (5.59 శాతం), తమిళనాడు (4.89 శాతం), సిక్కిం (3.82 శాతం), గోవా (3.76 శాతం), కేరళ (0.71 శాతం) చోటు దక్కించుకున్నాయి. అతి తక్కువ పేదరికంలో 7 రాష్ట్రాలు, తక్కువ పేదరికంలో 10 రాష్ట్రాలు, మధ్యస్థ పేదరికంలో 7 రాష్ట్రాలు, ఎక్కువ పేదరికంలో 3 రాష్ట్రాలు, అతి ఎక్కువ పేదరికంలో ఒక్క బీహార్ రాష్ట్రం నిలిచాయని నీతి ఆయోగ్ వర్గీకరించింది.

## కేంద్రపాలిత ప్రాంతాల్లో పేదరిక సూచీ:

కేంద్రపాలిత ప్రాంతాల్లో దాద్రా నగర్ హవేలిలో 27.36 శాతం, జమ్ము కాశ్మీర్ లడక్‌లో 12.58 శాతంతో అధిక పేదరికం ఉండగా డయ్యూ డమన్‌లో 6.82 శాతం, చండీఘర్‌లో 5.97 శాతం, ఢిల్లీలో 4.79 శాతం, అండమాన్ నికోబార్‌లో 4.30 శాతం, లక్ష్యద్వీప్‌లో 1.82 శాతం పుదుచ్చేరిలో 1.72 శాతం పేదరికం నమోదైందని తేలింది.

## ఆంధ్రప్రదేశ్ జిల్లాల్లో పేదరికం:

ఆంధ్రప్రదేశ్‌లో బహుమితీయ పేదరిక సూచిక (యంపిఐ)లో కర్నూలు జిల్లా 20.69 శాతంతో 1వ స్థానంలో నిలువగా, 19.00 శాతంతో విజయనగరం, 15.63 శాతంతో ప్రకాశం, 15.10 శాతంతో విశాఖపట్నం, 14.01 శాతంతో శ్రీకాకుళం, 13.24 శాతంతో అనంతపూర్, 11.67 శాతంతో నెల్లూరు, 10.34 శాతంతో చిత్తూరు, 9.96 శాతంతో కడప, 9.11 శాతంతో పశ్చిమ గోదావరి, 8.98 శాతంతో కృష్ణ, 8.55 శాతంతో తూర్పు గోదావరి, 8.31 శాతంతో గుంటూరు జిల్లా చివరి 13వ స్థానంలో నిలిచాయి.

## తెలంగాణ జిల్లాల్లో పేదరికం:

తెలంగాణ జిల్లాల్లో పేదరికంలో (యంపిఐ) 27.43 శాతంతో 1వ స్థానంలో ఆదిలాబాద్ నిలువగా, 26.11 శాతంతో మహబూబ్‌నగర్, 21.44 శాతంలో నిజామాబాద్, 17.90 శాతంతో మెదక్, 15.30 శాతంతో నల్గొండ, 13.75 శాతంతో ఖమ్మం, 12.45 శాతంతో వరంగల్, 9.20 శాతంతో కరీంనగర్, 5.83 శాతంతో రంగారెడ్డి, 4.27 శాతంతో చివరి 10వ స్థానంలో హైదరాబాద్ జిల్లా నిలిచాయి. జాతీయ స్థాయిలో పేదరిక సమస్యలో తెలుగు రాష్ట్రాలు కొంత మెరుగైన ఫలితాలను సాధించినప్పటికీ రాబోయే రోజుల్లో మరింత నాణ్యమైన సేవలను ప్రజలకు అందిస్తూ పేదరికమే లేని తెలుగు రాష్ట్రాలను నిర్మించుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ముత్తంగి బాలికల గురుకులం సందర్శించిన అదనపు కలెక్టర్ రాజర్షి షా.!

**-భయం వద్దు... అందరికీ అండగా జిల్లా యంత్రాంగం ఉంది.**
**-ఉపాధ్యాయులు , విద్యార్థులు అన్ని జాగ్రత్తలు పాటించాలి.**
**-కోవిడ్ నిబంధనలను విధిగా పాటించాలి.**
**-గురుకులంలో 24 గంటలు అందుబాటులో వైద్య బృందం.**
**-ఫోన్ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయురాలు ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న అదనపు కలెక్టర్ రాజార్షి.**



సంగారెడ్డి, డిసెంబర్ 2 (నేటినిజం ప్రతినిధి) కరోనా పాజిటివ్ వచ్చిన విద్యార్థులకు, ఉపాధ్యాయినికి జిల్లా యంత్రాంగం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఎలాంటి భయాలు, ఆందోళనకు గురి కావద్దని అదనపు కలెక్టర్ రాజార్షి షా భరోసానిచ్చారు.

మంగళవారం ఆయన పటాన్ చెరు మండలం ముత్తంగిలోని మహాత్మ జ్యోతి బాపులే బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను సందర్శించారు. గురుకులం మొత్తాన్ని తిరిగి పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులకు బోధిస్తున్న తీరును, భౌతిక దూరం, మాస్కులు ధరించడం తదితర అంశాలను గమనించారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడారు.

విద్యార్థుల విషయంలో అన్ని వేళల అప్రమత్తంగా ఉండాలని , ఏ చిన్న అనారోగ్యం తలెత్తిన అలక్ష్యం చేయరాదని ఉపాధ్యాయులకు సూచించారు. ఏదేని ఆరోగ్య సమస్య ఉన్నట్లయితే ఆసుపత్రికి షిఫ్ట్ చేయాలన్నారు.

గురుకులంలోని అన్ని తరగతి గదులు, పరిసరాలు సోడియం హైపోక్లోరైడ్ పిచికారి చేయించామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు తెలిపారు.

కో విడ్ బారినపడిన పిల్లలు, ఉపాధ్యాయురాలు హోమ్ ఐసోలేషన్ లో ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని ప్రిన్సిపాల్ కు సూచించారు.

గురుకులంలో డాక్టర్లు ఏఎన్ఎం తో కూడిన వైద్య బృందం, రెవెన్యూ, పంచాయతీరాజ్ బృందాలు అక్కడే ఉండి 24 గంటలు పనిచేస్తున్నట్లు రాజర్షి తెలిపారు. అంబులెన్స్ ను అందుబాటులో ఉంచామన్నారు.

అనంతరం కోవిడ్ బారినపడిన పిల్లల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయురాలి కి ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని, డాక్టర్లు సూచించిన మేరకు మందులు వాడాలని, ఇంట్లోనూ మిగతా వారితో కలవకుండా ప్రత్యేక గదిలో ఉండాలని, మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని సూచించారు. మిగతా కుటుంబ సభ్యులు టెస్టులు చేయించుకోవాలన్నారు.

ఉపాధ్యాయురాలిని, పిల్లల తల్లిదండ్రులను టీకా వేసుకున్నారా? రెండు డోసులు తీసుకున్నారా అంటూ ఆరా తీశారు. టీకా తీసుకున్నామని వారు తెలపడంతో, తొందరగా రికవరీ అవుతుందని, భయపడవద్దని వారికి ధైర్యం చెప్పారు. ఏ అవసరం ఉన్న డిఎం అండ్ హెచ్ఓ ను /తనను ఫోన్లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

ఆయన వెంట డిఎంఅండ్హెచ్ఓ డాక్టర్ గాయత్రీ దేవి, డిప్యూటీ డిఎంఅండ్హెచ్ఓ, ఎంపీడీవో, తహసిల్దార్, ఎం పి ఓ, ఆర్ ఐ, తదితరులు ఉన్నారు.

# తెలంగాణకు హరితహారంలో మొక్కలు నాటేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి -అదనపు కలెక్టర్ రాజర్షి షా

సంగారెడ్డి, డిసెంబర్ 2(నేటినిజం ప్రతినిధి) మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజర్షి అధ్యక్షతన ఆయన చాంబర్లో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన 2022, 2023 మరియు 2024 సంవత్సరాలకు గాను జిల్లాలో వివిధ శాఖల ద్వారా నాటవలసిన మొక్కల లక్ష్యాలను నిర్దేశించారు.




జిల్లాలో 2022 సంవత్సరం 46.06 లక్షల మొక్కలు, 2023 సంవత్సరం 40.76 లక్షలు, 2024 సంవత్సరంలో 35.46 లక్షల మొక్కలు నాటడానికి లక్ష్యంగా నిర్దేశించారు.

అందుకు అనుగుణంగా ఆయా శాఖల అధికారులు నర్సరీలలో మొక్కలు పెంచాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేలా ఆయా అధికారులు ప్రణాళికతో లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఓ శ్రీనివాస్ రావు,జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, సంక్షేమ శాఖల అధికారులు, పశుసంవర్ధక, ఉద్యాన శాఖ, విద్య, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వి.ఓ. చిదంబరనార్ పోర్ట్ ట్రస్ట్‌లో 'విజిలెన్స్ అవగాహన వారోత్సవం -2021' ముగింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:వి.ఒ.చిదంబరనార్ పోర్ట్ ట్రస్ట్‌లో 'విజిలెన్స్ అవగాహన వారోత్సవం -2021' ముగింపు సమావేశం జరిగింది. వి.ఒ.చిదంబరనార్ పోర్ట్ ట్రస్ట్‌లో 'విజిలెన్స్ అవగాహన వారోత్సవం -2021' వేడుకల సందర్భంగా పోర్ట్ ట్రస్ట్‌లో 29 నవంబర్ 2021న వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. అక్టోబరు 26 నుండి నవంబర్ 1వ తేదీ వరకు వారం రోజుల పాటు నిర్వహించే విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవం సందర్భంగా పాఠశాల ఉ కళాశాల విద్యార్థులు మరియు పోర్టు ఉద్యోగులకు ఈ పోటీలను నిర్వహించారు. పోర్ట్ నిర్వహించిన పోటీలలో 150 మందికి పైగా పాఠశాల/కళాశాల విద్యార్థులు మరియు ఉద్యోగులు చురుకుగా పాల్గొన్నారు. వి.ఒ.చిదంబరనార్ పోర్ట్ ట్రస్ట్ చైర్మెన్ శ్రీ టి.కె. రామచంద్రన్ ఈ వారోత్సవం ముగింపు సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. దేశంలోని ప్రతి పౌరుడు వివిధ ప్రభుత్వ సంస్థలతో పెద్ద సంఖ్యలో పరస్పర వివిధ పనులను కలిగి ఉంటారని అన్నారు. సంస్థాగత లక్ష్యాలను చేరుకోవడానికి అత్యున్నత స్థాయి విశ్వసనీయతను కొనసాగించేలా ఈ పరస్పర చర్యలు ప్రక్రియను నిర్వహించడం



చాలా ముఖ్యమని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా వీఓసీ పోర్ట్ ట్రస్ట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శ్రీ జె. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ .. పాఠశాలలు, కళాశాలలో పోర్ట్ నిర్వహించే విజిలెన్స్ అవగాహన పోటీలు దేశ నిర్మాణ ప్రక్రియలోఅవినీతి వల్ల ఎదురవుతున్న అవరోధాల యువకులలో అవగాహన కల్పించేందుకు దోహదం చేస్తాయని అన్నారు.

# సముద్రజలంలో క్షారగుణం పెంచటం ద్వారా వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ తొలగింపు యత్నం

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:2020-21 సంవత్సరపు స్వర్ణజయంతి ఫెలో, అహమ్మదాబాద్ లోని ఫిజికల్ రీసెర్చ్ లేబరేటరీ లో అసోసియేట్ ప్రొఫెసర్ అయిన అరవింద్ సింగ్ ఒక అరుదైన పరిశోధనలో ముందడుగువేశారు. సముద్రజాలంలో క్షారగుణాన్ని తగ్గించటానికి వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్ ను వాడుకుంటే ప్రపంచాన్ని పీడిస్తున్న గ్లోబల్ వార్మింగ్ ను తగ్గించవచ్చుననే ఆలోచనలో ఉన్నారాయన. ఈ దిశగా ఇప్పటికే కొంత పురోగతి సాధించారు. వివిధ ప్రక్రియల కారణంగా వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ పెరిగిపోతుండటాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పరిశోధనలు ప్రారంభించారు. ఈ కోణంలో సాగుతున్న పరిశోధనలలో ఇది ముందడుగుగా భావిస్తున్నారు.

భౌతికశాస్త్రం చదువుకొని జీవభూగోళ రసాయన శాస్త్రంలో అధ్యయనం చేపట్టిన అరవింద్ సింగ్ శాస్త్రసాంకేతికశాఖ నెలకొల్పిన స్వర్ణజయంతి ఫెలోషిప్ సంపాదించుకున్నారు. సముద్రజలపు క్షారగుణాన్ని స్థిరంగా పెంచటానికి కొన్ని రకాల ఖనిజాల వాడకం ద్వారా సాధ్యమని ఆయన గుర్తించారు.

అలా పెరిగిన క్షార గుణ ప్రభావం కర్బనం మీద, నత్రజని మీద, భాస్వరం మీద ఎలా ఉంటుందో పరిశీలించి సముద్రపు నాచుమీద బాక్టీరియా మీద ఆ క్షారగుణ ప్రభావాన్ని మదింపు చేస్తున్నారు. వచ్చే దశాబ్దాలలో మనం పరిశ్రమల నుంచి, ఇతర మానవ కారక ఉద్గారాలనుంచి వచ్చే కార్బన్ డయాక్సైడ్ ను నిల్వ చేయటానికి భారీ రిజర్వాయర్లు అవసరం అవుతాయని హెచ్చరిస్తున్నారు.ఇప్పటి వరకు వచ్చిన అవగాహన ఆధారంగా రసాయనిక మార్పులను బట్టి పెద్ద ఎత్తున ఖనిజాలను కరిగించటం ద్వారా సముద్రపు నీటి క్షారగుణాన్ని తగ్గించి, పెద్దమొత్తంలో కార్బన్ డయాక్సైడ్ ను సముద్రపు నీటిలో నిల్వ చేయవచ్చునని ఆయన చెబుతున్నారు. ఖనిజాలను కరిగించటం వలన సముద్రపు కార్బొనేట్ రసాయనపు సమతుల్యతలో మార్పు వస్తుందని లెక్కగట్టారు. ఆ విధంగా క్షార గుణం పెరగటం వలన వాతావరణంలోని అదనపు కార్బన్ డయాక్సైడ్ ను వెయ్యేళ్లకు పైగా సముద్రపు నీటిలో కరిగించి నిల్వ చేయవచ్చునని అభిప్రాయపడుతున్నారు. సంద్రంలో ఇప్పుడున్న కార్బొనేట్ స్థితిలో మార్పు రాకుండానే ట్రిలియన్ టన్నుల మేరకు కార్బన్ ని నిల్వ చేయవచ్చునని, దీనివలన పెరిగే క్షారగుణం కూడా చాలా తక్కువని అంటున్నారు. పైగా ఇది సముద్రంలో సూక్ష్మ జీవుల ఆవరణం మీద ఆమ్ల స్వభావాన్ని తగ్గించటానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. అయితే, ఈ విషయంలో మరింత పరిశోధన జరగాల్సి ఉందని కూడా ఒప్పుకున్నారు.

కర్బన (13 సి), నత్రజని (15 ఎన్) ఐసోటోపులను వాడుకొని సముద్రంలో ప్రాథమికంగా జరిగే చక్రీయ మార్పులను అరవింద్ అధ్యయనం చేశారు. ఆయన తన పీహెచ్ డి పరిశోధనలో అరేబియా సముద్రంలో నత్రజని మీద పనిచేశారు. కీలకంగా ఆయన జరిపిన పరిశోధనల ప్రకారం కర్బనం, నత్రజని, భాస్వరం మధ్య నిష్పత్తి సముద్రపు నాచు మొక్కల్లోనూ, పోషకాల్లోనూ స్థిరమైన నిష్పత్తిలో ఉండదని తేలింది.

వాతావరణంలో పేరుకుపోయే రసాయనాల వలన కార్బన్ డయాక్సైడ్ తోబాటు నైట్రోజెన్ డయాక్సైడ్ కూడా పెరుగుతుందని ఆయన పరిశోధనలో వెల్లడైంది. ఆక్సిజెన్ ఐసోటోప్ తోబాటు సముద్రపు ఉప్పదనం కూడా మారుతూ ఉంటుందని గుర్తించారు. సముద్రంలో 180 ఐసోటోపిక్ రికార్డుల ఆధారంగా గత 20 ఏళ్లలో కరిగిన హిమాలయపు మంచుగడ్డలను కూడా ఆయన అంచనావేయగలిగారు.

# 300 సీట్లు గెలిస్తేనే ఆర్టికల్ 370 పునరుదరణ.. గులాం నబీ ఆజాద్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ ఆర్టికల్ 370 పునరుద్ధరణపై కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్ముకాశ్మీర్‌లో ఆర్టికల్ 370ను పునరుద్ధరించాలంటే కాంగ్రెస్ వల్ల అయ్యే పని కాదని .. ఎందుకంటే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ 300 స్థానాల్లో గెలుపొందితేనే అది అసాధ్యమని ఆయన అన్నారు. జమ్మూ-కాశ్మీరులోని పూంఛ్ జిల్లా కృష్ణఘాటి ఏరియాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అధికరణ 370 రద్దును కేవలం సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం మాత్రమే పునరుద్ధరించగలవని ఆయన పేర్కొన్నారు.తాము సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 300 మంది ఎంపీలు అవసరమని, 2024 ఎన్నికల్లో 300 మంది ఎంపీలు గెలుపొందాలన్నారు. అప్పుడే ఆర్టికల్ 370ని పునరిద్ధరించగలమన్నారు. అంత మంది ఎంపీలు గెలిచేదెప్పుడని.. ప్రస్తుతం ఆ పరిస్థితి కాంగ్రెస్‌లో కనిపించడం లేదని, అందుకే అధికరణ 370ని పునరుద్ధరిస్తానని వాగ్దానం చేయలేనని ఆజాద్ వ్యాఖ్యానించారు. దీంతో కాశ్మీర్‌లో కాంగ్రెస్ ఓట్లను కోల్పోయే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయని ఆజాద్ అన్నారు. ఇప్పటికీ కాంగ్రెస్ గత వైభవాన్ని సాధించలేకుంటే ఇకపై కష్టతరంగా మారుతుందన్నారు. కేవలం ఒక్క జమ్ము కాశ్మీర్ కాదు.. దేశంలో అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పట్టును కోల్పోతుందని ఆజాద్ వ్యాఖ్యానించారు.

# నకిలీ యాప్స్ ద్వారా వందలకోట్ల మోసం .. 14మంది అరెస్ట్ ..

హైదరాబాద్, డిసెంబర్ 2:రాను రాను సైబర్ నేరాలు ఎక్కువ అవుతున్నాయి. ఈ నేరాల్లో కోట్ల రూపాయలను కొల్లగొడుతున్నారు అగంతకులు. పోలీసులు ఎన్ని జాగ్రత్తలు చెప్పినా సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో ప్రజలు పడుతూనే ఉన్నారు. కాగా మన దేశంలోనే అతిపెద్ద సైబర్ మోసం గుట్టు రట్టు చేసినట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. లోన్ బజార్, ద లోన్ ఇండియా, ఎస్బీఐ ధనీ బజార్ పేర్లతో నకిలీ కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి వందల కోట్ల మోసాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒక స్పూఫింగ్ యాప్ ద్వారా ఎస్బీఐ అసలైన కస్టమర్ కేర్ నుంచే ఫోన్ వస్తున్నట్టు నమ్మిస్తూ జనాలను వీరు మోసం చేస్తుండటం విశేషం. దాంతో జనం నకిలీ ఏదో అసలు ఏదో తెలుసుకోలేకపోయారు.

కాగా ఈ కాల్ సెంటర్ నుంచి ఏడాది కాలంలో 33 వేల కాల్స్ చేశారని? కోట్ల రూపాయలను కాజేశారని స్టీఫెన్ వివరించారు. ఎస్బీఐ ఏజెంట్ల నుంచి కస్టమర్ల వివరాలు తీసుకుని క్రెడిట్ కార్డు ఉన్నవారి నుంచి డబ్బులు కాజేస్తున్నార న్నారు. ఈ యాప్ వాడకంలో ఫర్మాన్ హుస్సేన్ అనే వ్యక్తి కీలకంగా వ్యవహరించారని తెలిపారు. 18601801290 అనే నంబర్ నుంచి స్పూఫింగ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ ముఠాపై దేశ వ్యాప్తంగా 209 కేసులు నమోదయ్యాయని స్టీఫెన్




రవీంద్ర వివరించారు. మొత్తం 14 మందిని అరెస్ట్ చేశామని? 30 సెల్ ఫోన్లు, 3 ల్యాప్ టాప్ లు, కారు, బైక్స్ ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

# తమిళనాడులో 25మంది విద్యార్థులకు కరోనా .. స్కూల్ మూసివేత ..

చెన్నై. డిసెంబర్ 2: కరోనా ఓ పక్క.. ఒమిక్రాన్ మరోపక్క జనాలను భయాందోళనకి గురి చేస్తున్నాయి. కాగా తమిళనాడులోని ఓ పాఠశాలలో 25మంది విద్యార్థులకు కరోనా అని తేలింది. తొలుత ఇద్దరు విద్యార్థులు కరోనా లక్షణాలతో ఓ హాస్పిటల్‌లో చేరగా.. వారికి టెస్టుల్లో కరోనా పాజిటివ్ అని తేలింది. ఆ తర్వాత ఆ పాఠశాలలోని విద్యార్థులు, సిబ్బంది అందరివి కలిపి 374 మంది శాంపిళ్ల తీసుకుని టెస్టులు చేశారు. ఈ టెస్టుల్లో మరో 25 మందికి కరోనా పాజిటివ్ అని ఫలితాలు వచ్చాయి. ఒమిక్రాన్ భయాల నడుమ పాజిటివ్ తేలిన వారి టెస్టు శాంపిళ్లను ఏ వేరియంట్ అని తెలుసుకోవడానికి జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపించనున్నారు.తమిళనాడు తిరుప్పూర్ జిల్లా ధారాపురంలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు పిల్లలకు ఒంట్లో నలతగా ఉండటం, కరోనా లక్షణాలు కనిపించడంతో గతనెల 27న ఓ హాస్పిటల్‌కు వెళ్లి అడ్మిట్ అయ్యారు.

# పూణె, మహారాష్ట్రలలో సోదాలు నిర్వహించిన ఆదాయపు పన్నుశాఖ

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:పాడి పరిశ్రమ, పాల ఉత్పత్తుల తయారీలో నిమగ్నమైన పూణెకు చెందిన ఒక ప్రముఖ గ్రూప్ పై ఆదాయపు పన్ను శాఖ 25.11.2021న సెర్చ్ అండ్ సీజర్ ఆపరేషన్ (సోదాలు, స్వాధీనం)ను నిర్వహించింది. భారత దేశంలోని 6 నగరాలలో విస్తరించి ఉన్న 30 ప్రాంగణాలపై సోదాల చర్య కొనసాగింది.

ఈ సోదాల సందర్భంగా, పన్ను ఎగవేతకు సంబంధించిన పలు నేరారోపణ చేసే పత్రాలు, ఆధారాలను కనుగొని, స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆధారాల ప్రాథమిక విశ్లేషణలో నకిలీ కొనుగోళ్ళు, లెక్కల్లోకి రాని నగదు అమ్మకాలు, నగదు పరపతి బదలాయింపులు, వాటి చెల్లింపు, వివరణలేని నగదు రుణాలు తదితర పద్ధతులను అవలంబించి పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయంపై పన్నును ఎగవేసినట్టు స్పష్టంగా తేలింది. పశువుల అమ్మకం లేదా మరణం కారణంగా నష్టం వాటిల్లినట్టు తప్పుగా పేర్కొనడాన్ని కూడా గమనించారు.

పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయంపై నిర్దిష్ట తగ్గింపులను కోరేందుకు సరైన, వేర్వేరు ఖాతా పుస్తకాలను కూడా అసెసీ గ్రూప్ నిర్వహించలేదని సేకరించిన ఆధారాలు వెల్లడించాయి.

సోదాలలో దాదాపు రూ. 2.50 కోట్ల విలువైన లెక్కల్లోకి రాని నగదును, వివరించలేని ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని బ్యాంక్ లాకర్లను ఇంకా తెరవవలసి ఉంది. ఈ సోదా చర్యలో ఇంతవరకూ, దాదాపు రూ. 400 కోట్లకు పైగా లెక్కల్లోకి రాని ఆదాయాన్ని కనుగొన్నారు.

# పంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించిన - పారాదీప్ పోర్ట్ ట్రస్ట్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:"హెచ్.ఐ.వి. మహమ్మారి ముగింపు కోసం అందరూ సమానంగా గొంతు కలుపుదాం" అనే ఇతివృత్తంతో పారాదీప్ పోర్ట్ ట్రస్ట్ (పి.పి.టి) ఆసుపత్రిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు టౌన్‌షిప్ లో నివసిస్తున్నవారికి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు "వాకథాన్" నిర్వహించారు. చైర్మన్ శ్రీ పి.ఎల్. హరనాధ్ ఈ అవగాహన వాకథాన్ ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో, పి.పి.టి. ఉన్నతాధికారులతో పాటు, పి.పి.టి. ఆసుపత్రి వైద్యులు, పారామెడికల్ సిబ్బంది; సి.ఐ.ఎస్.ఎఫ్. సిబ్బంది; పారాదీప్ సాక్షరతా సమితి కార్యకర్తలు; ఎయిడ్స్ పై పనిచేస్తున్న ఎన్.జి.ఓ.(ఐ.ఆర్.డి.ఎంఎస్. మరియు సి.ఏ.ఎస్.డి) లకు చెందిన కార్యకర్తలు.; సామాన్య ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గుర్తుగా ఈ వాక్ థాన్ లో పాల్గొన్న వారందరూ ఎర్ర రంగు రిబ్బన్లు ధరించారు.

సి.ఏ.ఎస్.డి. / ఐ.ఆర్.డి.ఎం.ఎస్. సహకారంతో ఎయిడ్స్ పరీక్ష శిబిరాన్ని కూడా నిర్వహించి, 56 మందికి పరీక్షలు చేశారు. పరీక్షా పరికరాలు, సామాగ్రిని ఓ.ఎస్.ఏ.సి.ఎస్. అందించింది. "మేజర్ పోర్టులలో హెచ్.ఐ.వి. /ఎయిడ్స్ పరీక్షలు చేయాలని" ఎన్.ఏ.సి.ఓ. మరియు ఎం.ఓ.హెచ్.ఎఫ్.డబ్ల్యూ. కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం కింద ఒక బాధ్యత గా, పి.పి.టి. ఆసుపత్రి, హెచ్.ఐ.వి. / ఎయిడ్స్ పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది.

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని తొలిసారిగా 1988 సంవత్సరంలో పాటించారు. ఎయిడ్స్ మహమ్మారిని అంతం చేసే దిశగా ముందుకు సాగడానికి ప్రతిస్పందనను పెంచాలని పిలుపునిస్తూ, ఎయిడ్స్ కళంకానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ, హెచ్.ఐ.వి. /ఎయిడ్స్ పై అవగాహనను, జ్ఞానాన్ని పెంపొందించే ప్రయత్నంలో భాగంగా, ప్రతి సంవత్సరం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలు, వ్యక్తులు ఎయిడ్స్ మహమ్మారి పై అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు,

# రహదారుల వెంట మొక్కల పెంపకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:జాతీయ రహదారుల అభివృద్ధి అంటే అందులో ఎం.ఓ.ఆర్.టి.హెచ్. ద్వారా సేకరించిన చెట్ల ను సరైన రీతిలో నరికివేయడం కూడా ఒక భాగం. అందువల్ల, ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారుల విస్తరణ కోసం, వాటి వెంబడి ఉన్న చెట్లను కనిష్ట స్థాయిలో తొలగించడంపై దృష్టి కేంద్రీకరించడం జరుగుతోంది.

అటవీ (పరిరక్షణ) చట్టం- 1980; అటవీ మరియు అటవీ యేతర ప్రాంతాలకు సంబంధించిన స్థానిక చట్టాల ప్రకారం చెట్లను నరకడం లేదా తొలగించడం కోసం తగిన అధికారుల నుంచి అనుమతి పొందిన తర్వాత, చెట్లను నరకడం లేదా తొలగించడం అనే ప్రక్రియను అటవీ శాఖ, అటవీ కార్పొరేషన్ లేదా కాంట్రాక్టర్ ద్వారా నిర్వహించడం జరుగుతుంది. చెట్ల నరికివేతకు సంబంధించిన సమాచారాన్ని, ఆయా ప్రాజెక్టుల స్థాయిలో సమీకరించి, నిర్వహించడం జరుగుతుంది.

పర్యావరణ పరంగా సంభవించే నష్టాన్ని భర్తీ చేసేందుకు, రహదారుల మధ్యలోనూ, రహదారులకు ఇరువైపులా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని ఒప్పందం ప్రకారం కాంట్రాక్టర్ ద్వారా లేదా అటవీ శాఖ ద్వారా చేపట్టడం జరుగుతుంది. వీటికి అదనంగా, ఎఫ్.సి.ఏ.-1980 మరియు స్థానిక చట్టాల ప్రకారం చట్టబద్ధమైన సమ్మతి కోసం అటవీశాఖ పరిహార అడవుల పెంపకాన్ని చేపట్టడంతో పాటు, పోటీ బిడ్డింగ్ ద్వారా ప్రైవేట్ ఏజెన్సీలు / ఎన్.జి.ఓ. సంస్థలు కూడా ఈ మొక్కలు పెంచే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

2017-2018 నుండి 2021-22 వరకు (అక్టోబర్, 2021 వరకు) జాతీయ రహదారుల వెంబడి ఎన్.హెచ్.ఏ.ఐ.మొత్తం 223.94 లక్షల మొక్కలను నాటింది. వీటికి అదనంగా, 2021, మార్చి వరకు 94 ప్రాజెక్టుల్లో 55.10 లక్షల మొక్కలు నాటడం జరిగింది.

ఈ విషయాన్ని, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ఈ రోజు రాజ్యసభలో లిఖితపూర్వకంగా సమర్పించిన సమాధానంలో తెలిపారు.

# గెజిట్ నోటిఫికేషన్ అమలుపై ఏపీ, తెలంగాణ మెలికలు..

హైదరాబాద్, డిసెంబర్ 2: కేంద్ర జలశక్తి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలుపై కృష్ణా, గోదావరి బోర్డులు చూపిస్తున్న శ్రద్ధ తెలుగు రాష్ట్రాలకు ఉండటం లేదు. ఏపీ, తెలంగాణలో ఒక్క ప్రాజెక్టు కూడా ఇంతవరకు కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిలోకి రాలేదు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో నీటి వాటాలపైనే రెండు రాష్ట్రాల మధ్య ప్రధానమైన వివాదం కావటంతో పాటు– గెజిట్ అమలును తామే కోరినందున ఏపీ ఒక అడుగు ముందుకేసి విద్యుత్ ప్రాజెక్టులను కలుపుకుని ఆరు కాంపోనెంట్లను అప్పగించేందుకు ఉత్వర్వులు జారీ చేసింది. కట్టవిరగకుండా, పాము చావకుండా తెలంగాణ ప్రాజెక్టులను స్వాధీనం చేసుకున్న తరువాతనే తాము జారీ చేసిన ఉత్తర్వులు అమలయ్యేలా ప్రభుత్వం షరతు విధించింది. గోదావరి పరిధిలోని ప్రాజెక్టులను టేకోవర్ చేయాల్సి వచ్చినా అన్నింటినీ ఒకసారి తీసుకోవాలని కోరుతోంది. తెలంగాణ ఇంతవరకు ఆ ఊసే ఎత్తటం లేదు. దీంతో ఏపీ ఉత్తర్వులు జారీ చేసినా కృష్ణా బోర్డు ప్రాజెక్టులను కూడా స్వాధీనం చేసుకోలేకపోతోంది.

ఇక..గోదావరి ప్రాజెక్టుల విషయంలో రెండు రాష్ట్రాలు దాదాపు ఒకే అభిప్రాయంతో ఉన్నాయి. పెద్దవాగు తప్ప రెండు రాష్ట్రాల పరిధిలో ఉన్న గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం లేదని ప్రభుత్వాలు అభిప్రాయ పడుతున్నాయి. కృష్ణా పరిధిలోని ప్రాజెక్టుల స్వాధీనంపై రేకెత్తుతున్న వివాదాలు సద్దుమణిగాక గోదావరి ప్రాజెక్టులపై స్పష్టత ఇచ్చేందుకు ఏపీ సిద్ధంగా ఉండగా.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది. పెద్దవాగు తప్ప గోదావరిపై ఏ ప్రాజెక్టును అప్పగించే ఉద్దేశ్యం తమకు లేదని తాజాగా తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్ గోదావరి బోర్డు ఛైర్మన్‌కు లేఖ రాశారు. తమ అనుమతి లేకుండా గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ ఎంబీ) ఉపసంఘం గోదావరి ప్రాజెక్టులను సందర్శించటం, గెజిట్ అమల్లో భాగంగా వాటి స్వాధీనానికి నివేదిక సిద్ధం చేసి కేంద్ర జలశక్తికి పంపించేందుకు ప్రయత్నించటంపై లేఖలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉపసంఘంలో తాము సభ్యులుగా ఉన్నందున నివేదిక తయారీలో తమ భాగస్వామ్యం ఉండదని కూడా స్పష్టం చేశారు.

# ఆర్టీసీ అడ్వాన్స్‌టికెట్ బుకింగ్.. ప్రైవేట్ దోపిడీకి అడ్డు కట్ట..

హైదరాబాద్, డిసెంబర్ 2:ప్రభన్యూస్: దూరప్రాంత ప్రయాణికులకు ఆర్టీసీ తీపి కబురు చెప్పింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని దూర ప్రాంత సర్వీసుల్లో 60 రోజుల ముందుగానే అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకునేందుకు వెసులుబాటు కలిపించింది. ప్రస్తుతం ఈ అవకాశం 30 రోజుల ముందుగానే ఉంది. ప్రైవేటు ట్రావెల్స్ దందాకు అడ్డుకట్ట వేయడంతో పాటు వీలైనన్ని ఎక్కువ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. సంక్రాంతి పర్వదినంతో పాటు క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో వేర్వేరు ప్రాంతాల నుంచి పలువురు సొంత ప్రాంతాలకు వెళుతుంటారు. ఆర్టీసీ టిక్కెట్లు అందుబాటులో లేక పలువురు ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తుంటారు. మరీ ముఖ్యంగా సంక్రాంతి సీజన్‌లో ఈ సమస్య పెద్ద ఎత్తున తలెత్తుతుంది. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో స్థిరపడిన తెలుగువారు సంక్రాంతికి సొంత గ్రామాలకు పెద్ద ఎత్తున తరలి వస్తుంటారు. ఏటా ప్రైవేటు ట్రావెల్స్ దందాపై పలు ఆరోపణలు రావడం, రవాణాశాఖ అధికారులు నామమాత్రపు దాడులు చేయడం పరిపాటిగా మారింది.

ఈ క్రమంలోనే ఆర్టీసీ అధికారులు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం పెంచుతూ ప్రయాణికులకు వెసులుబాటు ఇచ్చింది. గత దసరా సమయంలో స్పెషల్ సర్వీసుల నుంచి ఆశించిన ఆదాయం రాకపోవడంతో ముందస్తుగా మేల్కొన్న ఏపీఎస్ ఆర్టీసీ పండుగల సీజన్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి, కడప, అనంతపురం వంటి ప్రాంతాలకు, ఆయా ప్రాంతాల నుంచి అన్ని జిల్లాలకు అడ్వాన్స్ రిజర్వేషన్ కలిపిస్తున్నట్లు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) కేఎస్ బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు అడ్వాన్స్ వ్యవధిని పెంచినట్లు ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమల రావు తెలిపారు. ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# "ఒమిక్రాన్ " ముప్పు పొంచి ఉంది..!

**-జిల్లాలో యుద్ధ ప్రాతిపదికన వ్యాక్సినేషన్ చేయాలి**
**-అర్హులందరికీ విధిగా వ్యాక్సిన్ ఇవ్వాలి**
**-డాక్టర్ల ఉదాసీన వైఖరి సరికాదు**
**-ప్రజలను చైతన్య పర్చాలి....జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

సంగారెడ్డి,డిసెంబర్,02(నేటినిజం ప్రతినిధి) జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి యుద్ధ ప్రాతిపదికన వ్యాక్సినేషన్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు.

బుధవారం సాయంత్రం కలెక్టరేట్ ఆడిటోరియంలో వైద్య ఆరోగ్య శాఖ ,పంచాయతీ రాజ్, తదితర శాఖల అధికారులతో వ్యాక్సినేషన్ పురోగతి పై సమీక్షించి దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒమిక్రాన్ తో ముప్పు పొంచి ఉందని, జిల్లా లో అర్హులందరికీ 100% వ్యాక్సినేషన్ పూర్తి కావాలన్నారు. ప్రజలను చైతన్యపరచాలన్నారు. వ్యాక్సినేషన్ విషయమై మండల ప్రత్యేక అధికారులు, ఆయా అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు.

ప్రజల ఆరోగ్యం క్షేమాన్ని మించిన పని ఏదీ లేదని, అందరూ క్షేత్ర స్థాయిలో తిరిగి ప్రజలను చైతన్యపరిచి వ్యాక్సిన్ వేయించాలన్నారు.

డాక్టర్లు ప్రత్యేక అధికారులు ఉదాసీన వైఖరితో ఉండడం సరికాదన్నారు. అన్ని ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలో 18 సంవత్సరాలు నిండిన అందరికీ వ్యాక్సిన్ వేయడం పూర్తి కావాలని, అందుకు విద్యాశాఖ అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

మొదటి డోసు తీసుకున్న తర్వాత నిర్ణీత సమయం పూర్తయిన వారికి రెండవ డోసు ఇవ్వడం పై దృష్టి సారించాలన్నారు. రెండు డోసులు తీసుకుంటేనే సురక్షితమని అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యపరంగా జిల్లా సంక్షోభంలోకి వెళ్లకుండా జాగ్రత్త పడాలన్నారు .

జిల్లాలో అవసరమైనంత వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు.

పిహెచ్సి వారిగా వ్యాక్సినేషన్ పురోగతిని సమీక్షించారు. తక్కువ పురోగతి గల సంబంధిత మెడికల్ ఆఫీసర్, ఎం పి డి ఓ, డిప్యూటీ డిఎంఅండ్హెచ్ఓ లపై కలెక్టర్ అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేసారు.

మైగ్రేట్ అయిన వారి జాబితా పేర్లతో సహా ఉండాలని స్పష్టం చేశారు. ఇతర పి హెచ్ సి, ఇతర జిల్లాల్లో వ్యాక్సినేషన్ తీసుకున్న వారి జాబితా అందించాలన్నారు. తప్పుడు లెక్కలతో సరిపుచ్చ వద్దని, వాక్సినేషన్ వేయించడం ఆయా డాక్టర్లు ,అధికారుల బాధ్యత అన్నారు .

వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేసిన పిహెచ్సి ,గ్రామం ,వార్డ్ మండలాన్ని పూర్తి చేసినట్లు డిక్లరేషన్ చేయాలని తెలిపారు. గ్రామాల్లో సర్పంచ్ల సహకారం తీసుకోవాలని సూచించారు. పంచాయతీ సెక్రటరీ లను పూర్తి భాగస్వాములను చేయాలనిడి పీ ఓ కు ఆదేశించారు.

వ్యాక్సినేషన్ పూర్తయ్యే వరకు ఎవరికీ ఎలాంటి సెలవులు ఉండవని స్పష్టం చేశారు. గ్రామం వారిగా డ్రైవ్ చేపట్టి వారంలోగా పూర్తిచేయాలని ఆదేశించారు.

ఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, రాజార్శి షా, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి పి ఓ సురేష్ మోహన్, డిఎంఅండ్హెచ్ఓ గాయత్రీ దేవి, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డా. శశాంక్, అదనపు పీడీ లు, జిల్లా అధికారులు,డి ఎల్ పి వో లు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, ఎంపీడీవోలు, ఎం పి వో లు, తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి



పరిగి డిసెంబర్ 2 : వచ్చే యాసంగిలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ సూచించారు. మండల పరిధిలోని గడి సింగపూర్ రైతు వేదికలో యాసంగిలో పంటల నమోదు, పంటల మార్పిడి విధానం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ?. రానున్న యాసంగిలో రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. రైతుల లాభసాటి పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రత్యామ్నాయంగా వేరుశనగ, శనగ, నూనె గింజలు, నువ్వులు, బెబ్బర్ లు, మినుములు, ప్రొద్దుతిరుగుడు, పెసలు తదితర పంటలను సాగు చేయాలని సూచించారు.

ఆరుతడి పంటలతో రైతులు ఆర్థికాభివృద్ధి చెందుతారని ఆయన సూచించారు. వచ్చే యాసంగిలో తప్పనిసరిగా లాభసాటి పంటలపై దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. పంటల సాగులో సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు ఉంటాయని సూచించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాల మేరకు పంటల సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు స్థానిక సర్పంచ్ అశోక వర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పద్మమ్మ, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, ఏడీఏ రాధిక, వ్యవసాయ అధికారి ప్రభాకర్ రెడ్డి, ఏఈఓ స్రవంతి రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# సస్పెన్షన్‌కు గురైన 12 మంది రాజ్యసభ సభ్యులను కలిసిన రాహుల్ గాంధీ!



న్యూఢిల్లీ, డిసెంబర్ 2:పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిసేవరకూ పెద్దల సభ నుంచి తమను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన సస్పెన్షన్‌కు గురైన 12 మంది రాజ్యసభ సభ్యులను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కలిశారు. సస్పెండ్ అయిన విపక్ష సభ్యుల నిరసనకు రాహుల్ సంఘీభావం ప్రకటించారు.

కాగా పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగించారని 12 మంది రాజ్యసభ సభ్యులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సస్పెన్షన్‌కు గురైన వారిలో ఛాయా వర్మ, రిపున్ బోరా, వినయ్ విశ్వం, రాజమణి పటేల్, డోలా సేన్, ఎలమారం కరీం, ఫులో దేవి నేతం, సయ్యద్ నజీర్ హుస్సేన్, ప్రియాంక చతుర్వేది, అనిల్ దేశాయ్, అఖిలేష్ ప్రసాద్ సింగ్, శాంత చెత్రి ఉన్నారు.

మరోవైపు రైతుల మృతి, ద్రవ్యోల్బణం అంశాలపై విపక్ష ఎంపీలు సభలో నినాదాలతో హోరెత్తించారు. రైతాంగం సహా ప్రజా సమస్యల పట్ల కేంద్రం తీరును నిరసిస్తూ కాంగ్రెస్, టీఆర్ఎస్, ఆర్జేడీ, ఆర్జేడీ, ఐయూఎంఎల్, ఎన్సీపీ, తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం, డీఎంకే పెద్దల సభ నుంచి వాకౌట్ చేశాయి.

# వసంత మండపంలో ఘనంగా ధన్వంతరి పూజ

తిరుమల, డిసెంబర్ 2:: కార్తీక మాసంలో టీటీడీ తలపెట్టిన విష్ణుపూజల్లో భాగంగా గురువారం తిరుమల వసంత మండపంలో ధన్వంతరి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు జరిగిన ఈ పూజా కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు, వారికి అభిముఖంగా ధన్వంతరి స్వామివారిని వసంత మండపంలో వేంచేపు చేశారు.



ఈ సందర్భంగా వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు మాట్లాడుతూ దేవతలు, దానవులు మందంగిరి పర్వతాన్ని వాసుకి తాడుగా చేసి క్షీర సాగరాన్ని మథించగా అందులో మందరగిరి పర్వతం మునిగిపోతుందని తెలిపారు. ఆ సమయంలో దేవతలు మహావిష్ణువును ప్రార్థించగా స్వామివారు మహా కూర్మంగా అవతరించి మందరగిరి పర్వతాన్ని తన వీపుపై మోసి అమృతాన్ని ఉద్భవింప చేసినట్లు తెలియజేశారు.క్షీరసాగర మథనంలో మొదట హాలాహలం ఉద్భవించిందని, దీన్ని పరమ శివుడు సేవించి కంఠంలో ఉంచుకొన్నార న్నారు. తర్వాత ఐరావతం, కామధేనువు, కల్పవృక్షం, పారిజాతం మొదలైనవి ఉద్భవించా యని, వీటిని త్రిలోకాధిపతి అయిన ఇంద్రు డు గ్రహించాడన్నారు. అనంతరం లక్ష్మి దేవి ఉద్భవించిందని, అమ్మవారిని శ్రీమహ విష్ణువు గైకొని తన హృదయంలో ప్రతిష్టించుకున్నట్లు తెలిపారు.క్షీరసాగర మథనంలో చివరిగా శంఖు చక్రాలు, అమృత కళశంతో అద్భవించిన ధన్వంతరి స్వామివారు ఆయుర్వేద విద్యకు ప్రసిద్ధి అని, శ్రీ మహావిష్ణువు అవతారవ ున్నారు. ధన్వంతరి జయంతి సందర్భంగా గురువారం తిరుమలలో ధన్వంతరి పూజ వలన విశ్వంలోని ప్రాణి కోటికి హానికలిగి ంచేవి నశించి, సంపూర్ణ ఆరోగ్యాన్ని, శాంతి సౌభాగ్యాలను ప్రసాదించనున్నట్లు వివరించారు.ముందుగా ఘంటా నాదంతో సకల దేవతలను ఆహ్వానించి, కార్తీక విష్ణు పూజా సంకల్పం చేసి, అష్టదిక్పాలకులు, నవగ్రహాల అనుగ్రహంతో లోక క్షేమం కొరకు ప్రార్థన చేశారు. ఆ తరువాత ధన్వంతరి పూజ, నివేదన, హారతి సమర్పి ంచారు. అనంతరం క్షమా ప్రార్థన, మంగళ ంతో ఈ పూజ ముగిసింది. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షి తులు, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

# కేజ్రీవాల్ తరహా పాలనను కోరుకుంటున్న పంజాబీలు : ఆప్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ తరహా పాలనను పంజాబ్ కోరుకుంటోందని, ఆ రాష్ట్రంలో ఆప్ తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ నేత రాఘవ్ చద్దా అన్నారు. పంజాబ్‌లో తమ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిని సరైన సమయంలో ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్, అకాలీదళ్ వంటి సంప్రదాయ పార్టీలతో పంజాబీలు విసిగిపోయారని, ఆప్‌నకు ఒక అవకాశం ఇవ్వాలని వారు కోరుకుంటున్నారని అన్నారు.

పంజాబ్‌లో తాము ఎక్కడికి వెళ్లినా ప్రజలు ప్రధాన పార్టీల పట్ల అసంతృప్తితో ఉన్నట్టు కనిపించిందని ఆప్, అరవింద్ కేజ్రీవాల్‌కు ఓ అవకాశం ఇవ్వాలనే సెంటిమెంట్ నెలకొందని చెప్పారు . ఆప్ పంజాబ్ ఎన్నికల్లో ఈసారి నిర్ధిష్టంగా పూర్తి మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఢిల్లీలో ఆప్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పూర్తిచేసిన పనులు పంజాబ్ ప్రజలకు తెలుసన్నారు.

# ఢిల్లీలో మళ్లీ మూతపడ్డ పాఠశాలలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యం పెరుగుతున్నది. గురువారం కాలుష్యంపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వాల తీరుపై మండిపడింది. ఈ క్రమంలో పాఠశాలలను మూసి వేస్తున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు పాఠశాలలు మూసే ఉంటాయని పర్యావరణశాఖ మంత్రి గోపాల్‌రాయ్ వెల్లడించారు. ఢిల్లీలో వాయుకాలుష్యంలో ఎలాంటి మెరుగుదల కనిపించడం లేదని, ఈ కారణంగా పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పాఠశాలలను మూసివేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

# కలెక్టరేట్‌లో అందుబాటులోకి మీ సేవ కేంద్రం...!-జిల్లా కలెక్టర్ హనుమంతరావు.



సంగారెడ్డి, డిసెంబర్ 02 (నేటినిజం ప్రతినిధి) భూ సమస్యలపై కలెక్టరేట్కు వచ్చే ప్రజలకు మీ సేవలో దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన ధరణి హెల్ప్ డెస్క్ లో మీసేవ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు.

బుధవారం ఆయన కలెక్టరేట్లోని మీసేవ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు.

ధరణి కి సంబంధించి మీ సేవలో దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు ఎక్కడెక్కడో మీ సేవా కేంద్రాల కోసం తిరగాల్సిన అవసరం లేకుండా, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా కలెక్టరేట్లోనే మీసేవ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కేంద్రాన్ని బుధవారం నుండి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.

మీ సేవా కేంద్ర నిర్వహణ సజావుగా జరిగేలా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు.కలెక్టర్ వెంట అదనపుకలెక్టర్ వీరారెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఓటరు సవరణ జాబితాలు పకడ్బందీగా వేగవంతంగా సిద్ధం చేయాలి. -జిల్లా కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శశాంక్ గోయల్ .



సంగారెడ్డి, డిసెంబర్ 02 (నేటినిజం ప్రతినిధి) బుధవారం ఓటర్ నమోదు కార్యక్రమం ,గరుడ యాప్ వినియోగం, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శశాంక్ గోయల్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా శశాంక్ గోయల్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారందరిని ఫారం–6 ద్వారా కొత్త ఓటర్లుగా నమోదు చేయడాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సూచించారు.

జనవరి 1, 2022 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో నమోదు కావాలని తెలిపారు.

ఓటర్ల జాబితాలో ఉన్న లాజికల్ పొరపాట్లు, డెమో గ్రాఫికల్ పొరపాట్లను పూర్తి స్థాయిలో సవరించాలని అధికారులను ఆదేశించారు.

ఓటర్ జాబితాలో చనిపోయిన వారి పేర్లను వారి సంబంధిత బంధువుల నుండి ఫారం–7 ద్వారా తీసుకొని లేదా సుమోటోగా తీసుకొని ఓటర్ల జాబితా నుండి వారి పేర్లను తొలగించాలని తెలిపారు. అలాగే డబుల్ ఓటర్లను,

శాశ్వతంగా వలస వెళ్ళిన వారిని గుర్తించి వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించాలని సూచించారు.

డిసెంబర్ 20,2021లోగా అభ్యంతరాలను ,ఓటర్ క్లెయిమ్స్ ను పూర్తి స్థాయిలో పరిష్కరించి, జనవరి 5,2022 న తుది ఓటరు జాబితా రుపొందించాలని ఆయన స్పష్టం చేశారు.

ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ జిల్లా వ్యాప్తంగా స్వీప్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని ,ప్రతి వారం స్విప్ కార్యక్రమాలకు సంబంధించిన ప్రెస్ క్లిప్పింగ్స్ ను వాట్సా ప్ గ్రూపు లో షేర్ చేయాలని సూచించారు.

ఓటర్లకు తమ పోలింగ్ స్టేషన్ సులువుగా తెలుసుకునే విధంగా భారత ఎన్నికల కమిషన్ గరుడ యాప్ ను రుపొందించిందని, దీని పై ప్రజలలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి గరుడ యాప్ వినియోగిస్తూ పరిష్కరించాలని, వివరాలను యాప్ లో అప్లోడ్ చేయాలని అధికారులకు ఆదేశించారు.స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కోవిడ్ 19 నిబంధనలు మేరకు పోలింగ్ మరియు కౌంటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.

జిల్లాలో నవంబర్ ఒకటి నుండి 30వ తేదీ వరకు 6, 6ఎ,7,8,8ఎ లకు సంబంధించి 2398 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ హనుమంతరావు శశాంక్ గోయల్ కు తెలిపారు. అందులో నియోజకవర్గం వారీగా నారాయణఖేడ్ 302, అందోల్ 435, జహీరాబాద్ 328, సంగారెడ్డి 292, పటాన్చెరు 1041 దరఖాస్తులు వచ్చాయన్నారు.వాటన్నింటిని సమగ్రంగా పరిశీలించి ఈ నెల 20 లోపు పరిష్కరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి అదనపు కలెక్టర్ వీరారెడ్డి,రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు బిగ్ షాక్ : పార్టీని వీడిన ఇద్దరు సీనియర్ నేతలు

షిల్లాంగ్, నవంబర్ 29:: మేఘాలయలో 17 మంది పార్టీ ఎమ్మెల్యేల్లో 12 మంది టీఎంసీలో చేరిన కొద్దిరోజుల్లోనే కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ఇద్దరు పార్టీకి రాజీనామా చేశారు. మేఘాలయా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేమ్స్ లింగ్డో, మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మానస్ దాస్ గుప్తా పార్టీకి గుడ్‌బై చెప్పారు.

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు రాజీనామా లేఖ పంపానని జేమ్స్ లింగ్డో వెల్లడించారు. గత 33 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో కీలక పదవులు చేపట్టానని, తన తండ్రి మేఘాలయాలో పార్టీని పటిష్టపరిచినా కాంగ్రెస్ నాయకత్వం తనను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందే మేఘాలయాలో కాంగ్రెస్ పార్టీ పతనం ఆరంభమైందని అన్నారు.

# రాచకొండ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో వన భోజనాలు

హైదరాబాద్ : రాచకొండ పోలీసు కమిషనరేట్ కార్యాలయ సిబ్బందికి సీపీ మహేశ్ భగవత్ వన భోజనాలను ఏర్పాటు చేశారు. కీసరలో నిర్వహించిన వన భోజనాలకు అడిషనల్ సీపీ సుధీర్ బాబు హాజరై పలు ఈవెంట్స్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రియల్, ఐడీ, అకౌంట్స్, సీసీఆర్‌బీ స్టాఫ్ పాల్గొన్నారు. సిబ్బంది అంతా ఉత్సాహంగా గడిపారు. షటిల్, క్రికెట్, క్యారమ్స్, కబడ్డీ, ఖో ఖో ఆడి ఎంజాయ్ చేశారు. ఈ ఆటల్లో విజేతలుగా నిలిచిన సిబ్బందికి అడిషనల్ సీపీ సుధీర్ బాబు, మల్కాజ్‌గిరి డీసీపీ రక్షిత కే మూర్తి, షీ టీమ్స్ డీసీపీ సలీమా బహుమతులను ప్రదానం చేశారు.

# డిసెంబర్ 14న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## -ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా థామస్ మాదిగ

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 2 (నేటి నిజం ప్రతినిధి):ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ



చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 14 చలో ఢిల్లీ విద్యార్థి జాతీయ మహాసభ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా థామస్ కోరారు. రుద్రంగి మండల కేంద్రంలో జూనియర్ కళాశాలలో డిసెంబర్ 14 చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా థామస్ మాదిగ హాజరై వారు మాట్లాడుతూ మాదిగ విద్యార్థి ఉపకులాలకు ఏబిసిడి వర్గీకరణతోనే సరైన న్యాయం జరుగుతుందని కాబట్టి గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఢిల్లీలోజరగబోయే విద్యార్థి మహా సభను విజయవంతం చేయడానికి వందలాది తరలి రావాలని థామస్ పిలుపునిచ్చారు ఇట్టి కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎమ్ ఎస్ ఎఫ్ నాయకులు బడుగు సంజీవ్ దయ్యాల శ్రీనివాస్ రోమాల అశోక్ దయ్యాల రమేష్ కాదాసు బాబు లింగాల శంకర్ కట్కూరి ప్రేమ్ కుమార్ దయ్యాల నారాయణ రాగుట్ల బాబు దయ్యాల ప్రసాద్ సింగారం గంగా రం సింగారం పవన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 202 రోజులుగా నిత్యాన్నదాన కార్యక్రమం




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 2 (నేటినిజం ప్రతినిధి):మైవేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న నిత్యాన్నదానకార్యక్రమం గురువారం నాటికి ×202× రోజులకు చేరుకుంది. దాతల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. ×నేటి అన్నదాన కార్యక్రమం లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ ముందు, పార్కింగ్ స్థలంలో, భీమేశ్వరాలయం ముందు ఉన్న యాచకులకు , అన్నర్థులకు మొత్తం 80 మందికి అన్నదానం చేయడం జరిగింది. ఈరోజు పెళ్లిరోజు, పుట్టినరోజు జరుపుకుంటున్న వారిని ఉద్దేశించి కేక్ కట్ చేసి స్వీట్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమం 202× రోజులుగా నిరంతరాయంగా నిర్వహించడం జరుగుతుందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. నిత్యాన్నదానం చేస్తున్న క్రమంలో గురువారం అన్నదాతలుగా నగుబోతు రవీందర్, రొక్కం నర్సింహారెడ్డి, బోనాల కనకరాజు, ఆర్ . వేంకటేశ్వర్లు, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్ వారి కుటుంబసభ్యులు× అందించిన విరాళాలతో నేటి అన్నదానం నిర్వహించడం జరిగింది.

దాతలు చేస్తున్న సహకారంతో నిత్య అన్నదాన కార్యక్రమం లక్ష్యంతో ముందుకు సాగడం జరుగుతుందని, అన్నదానం మహాదానం అని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నగుబోతు రవీందర్, మధు మహేష్, నాగుల చంద్రశేఖర్, తాళ్లపెల్లి ప్రశాంత్, జూలపెల్లి రాజు, ప్రతాప నటరాజు,కొప్పుల హన్మాండ్లు, చల్లా సత్తయ్య, మధు నిఖిల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి పథకం కన్వర్జెన్స్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:సమీక్షా సమావేశాల నిర్వహణ, క్లస్టర్ల సందర్శన మరియు థర్డ్‌పార్టీ మూల్యాంకనం మొదలైన వాటి ద్వారా ఫంక్షనల్ స్ఫూర్తి లాభదాయకత మరియు మార్కెట్‌కు సంబంధించిన అంశాలను ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ క్రమం తప్పకుండా అంచనా వేస్తుంది. దీని ఆధారంగా క్లస్టర్ల మార్కెట్ సామర్థ్యం మరియు లాభదాయకత గమనించబడింది. కొవిడ్ 19 మహమ్మారి కారణంగా వీటికి ప్రత్యేక మద్దతు అవసరం. దీనిని నిర్ధారించడానికి మార్కెట్ డిమాండ్‌ను తీర్చడానికి డిజైన్ డెవలప్‌మెంట్ మరియు ఉత్పత్తుల వైవిధ్యంపై శిక్షణ, ఇ-కామర్స్ పోర్టల్‌లతో అనుసంధానాలను ప్రోత్సహించడం మొదలైన అనేక కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ చేపట్టింది.

స్ఫూర్తి పథకం దేశవ్యాప్తంగా వర్తిస్తుంది. అయితే ఈ పథకం యొక్క పరిధిని దేశవ్యాప్తంగా విస్తరించేందుకు ఆమోదించబడిన స్ఫూర్తి క్లస్టర్ మరియు ఆస్పిరేషనల్ జిల్లాలు లేని జిల్లాల నుండి స్వీకరించిన ప్రతిపాదనలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. మంత్రిత్వ శాఖ స్ఫూర్తి పథకాన్ని కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/డిపార్ట్‌మెంట్ల ఇతర సంక్షేమ పథకాలతో కలిపేలా ప్రోత్సహిస్తుంది. క్లస్టర్ల అమలు చేసే ఏజెన్సీలు ఇప్పటికే బ్యాంకు ఖాతాలను తెరిచి, కళాకారులందరికీ సాధారణ మరియు ఆరోగ్య బీమాను అందించాలి.

స్ఫూర్తి కింద హస్తకళాకారులకు కనీస వేతనం పేర్కొనబడలేదు. అయినప్పటికీ సాంప్రదాయ కళాకారుల నైపుణ్యాన్ని పెంపొందించడానికి మరియు వారి ఉత్పత్తులకు విలువను జోడించడానికి వారికి మౌలిక సదుపాయాలను అందించడానికి, తద్వారా వారి ఆదాయాన్ని స్థిరమైన రీతిలో పెంచడానికి మంత్రిత్వ శాఖ ఈ పథకం కింద అవసరమైన చొరవలను తీసుకుంటుంది. స్ఫూర్తి క్లస్టర్ ఆమోదం పొందినప్పటి నుండి దాని ఫంక్షనలైజేషన్ కోసం కాలపరిమితి సాధారణ క్లస్టర్‌కు (500 మంది కళాకారుల వరకు) 12 నెలలు మరియు మేజర్ క్లస్టర్‌కు 18 నెలలు (500 కంటే ఎక్కువ మంది కళాకారులు). క్లస్టర్ల ఫంక్షనలైజేషన్ కోసం టైమ్‌లైన్‌కు కట్టుబడి ఉండేలా మంత్రిత్వ శాఖ అమలులో ఉన్న క్లస్టర్‌లను క్రమం తప్పకుండా సమీక్షిస్తుంది.

ఈ రోజు లోక్‌సభలో కేంద్ర ఎంఎస్‌ఎంఈ మంత్రి శ్రీ నారాయణ్ రాణే లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని అందించారు.

# సృజనాత్మక ఆవిష్కరణలతో వైజ్ఞానిక ప్రగతి .. ఘనంగా ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవం



మంగళగిరి రూరల్,డిసెంబర్ 2:ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన సృజనాత్మక ఆవిష్కరణలకు ప్రాణం పోయాలని, అప్పుడే వైజ్ఞానిక ప్రగతి వరుగులు తీస్తుందని న్యూయార్క్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ ఆండ్రూ డి. హామిల్టన్ అభిప్రాయపడ్డారు, కరోనా కష్టకాలంలోనూ ఏపీ ఎస్ఆర్ఎం విద్యార్థులు మేథస్సుకు పదును పెట్టి ఉత్తమ ఫలితాలను సాధించడం విశేషమన్నారు. బుధవారం రాత్రి 8 గంటలకు ఎస్ఆర్ఎం వర్సిటీ కులపతి మరియు ఎంపీ డాక్టర్ టీఆర్ పారివేందర్ అధ్యక్షతన యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవం జరిగింది.

న్యూయార్క్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ ఆండ్రూ డి. హామిల్టన్ (న్యూయార్క్) ముఖ్య అతిథిగా దృశ్య మాధ్యమ పద్ధతి (వర్చువల్)లో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం యాజమాన్యాన్ని, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులను అభినందించారు. గొప్ప చరిత్ర కలిగిన యూనివర్సిటీలతో అనుబంధాన్ని కలిగి ఉన్న తాను ఆంధ్రప్రదేశ్లోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రగతి చూసి విస్మయానికి గురయ్యానన్నారు. భవిష్యత్తు కాలంలో ఉన్నత విద్యకు విశేషమైన ప్రాధాన్యం ఒనగూరనుందనీ, చీకటి నుంచి వెలుగును ప్రసరింపజేయడానికి విశ్వవిద్యాలయాలు సరికొత్త బాటలు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా న్యూయార్క్ యూనివర్సిటీ సందర్శించాలని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యాన్ని, విద్యార్థులను కోరారు.

స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ను అందుకున్న నేషనల్ సైన్స్ ఫౌండేషన్ (యూఎస్ఏ) డైరెక్టర్ డాక్టర్ సేతురామన్ పంచనాథన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నిబద్ధత, నిజాయితీలతో మెలగాలని కోరారు. విద్యార్థులు తమకున్న సామర్థ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పర్చుకోవాలన్నారు. భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్ మాట్లాడుతూ, దేశంలో సరికొత్త విద్యా అవసరాలను తీర్చాలన్న దృక్పథంతో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీని స్థాపించడం జరిగిందన్నారు. విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే విద్యను అందించడమే తమ ముందున్న లక్ష్యమని పేర్కొన్నారు.

జాతీయ విద్యా విధానం -2020లో పొందుపర్చిన విధంగా ఏపీ ఎస్ఆర్ఎంలో విద్యాబోధన, పరిశోధనలు సాగుతున్నాయని యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి సత్యనారాయణన్ పేర్కొన్నారు. యూనివర్సిటీ పరంగా పరిశోధనలను విస్తృత పరుస్తున్నావన్నారు. కొత్త యూనివర్సిటీ అయినప్పటికీ అనతి కాలంలో అన్ని విధాలా ఏపీ ఎస్ఆర్ఎం అభివృద్ధి సాధించడం గర్వకారణంగా ఉందన్నారు.

ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వజ్జా సాంబశివరావు యూనివర్సిటీ ప్రగతిని వివరించారు. తొలి బ్యాచ్ విద్యార్థులు సాధించిన విజయాలను, దక్కించుకున్న ప్లేస్మెంట్లను, ఏర్పాటు చేసిన స్టార్టప్ లను నివేదించారు. యూనివర్సిటీ యాజమాన్యం కల్పించిన విద్యా సదుపాయాలను కొనియాడారు. అనంతరం తొలి బ్యాచ్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. మెరిట్ విద్యార్థులకు బంగారు పతకాలను ప్రకటించారు. నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ సేతురామన్ గౌరవ డాక్టరేటు అందుకున్న ఇదే స్నాతకోత్సవంలో డిగ్రీలు అందుకోవడం పలువురు విద్యార్థులు అదృష్టంగా భావించారు. ఈ కార్యక్రమంలో చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి. ముత్తమై సెల్వన్, ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రొ-వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి నారాయణరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమకుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్‌పై అత్యాచారం.. నిందితుడికి మూడేండ్ల 6 నెలల జైలు శిక్ష

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 2:: మైనర్‌పై అత్యాచారం కేసులో ఓ నిందితుడికి మూడేండ్ల 6 నెలల జైలు శిక్ష విధిస్తూ జిల్లా మొదటి అడిషనల్ జడ్జి పీ చంద్రశేఖర్ రెడ్డి తీర్పును వెలువరించారు. మణుగూరుకు చెందిన ఎస్కే మహబూబ్ అలీ(40) ఓ మైనర్‌పై కొద్ది నెలల క్రితం అత్యాచారం చేశాడు. దీంతో బాధిత కుటుంబం మణుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్.. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏఎస్పీ శబరీష్ సమగ్ర విచారణ చేపట్టి, తగిన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితుడికి కోర్టు మూడేండ్ల 6 నెలల జైలు శిక్ష విధించడంతో పాటు రూ. 6 వేల జరిమానా విధించింది. ఈ సందర్భంగా ఏఎస్పీ శబరీష్, ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్, సీడీవో రమేశ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్త వెంకటేశ్వర్ రావుతో పాటు కానిస్టేబుల్ రమేశ్‌ను జిల్లా ఎస్పీ సునీల్ దత్ అభినందించారు.

# ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలంపియాడ్ టెస్ట్ - 2021 గోడప్రతికను ఆవిష్కరించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల - అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి




కరీంనగర్ డిసెంబర్ 2 (నేటినిజం ప్రతినిధి): శ్రీ శ్రీనివాస రామానుజన్ సేవలు చాలా ఉన్నతమైనవని మరియు చారిత్రాత్మకమైనవని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి అన్నారు .గురువారం కరీంనగర్ స్థానిక వావిలాల పల్లిలోని అల్ఫోర్స్ టైనిటాట్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి అల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్ -2021 గోడప్రతి క ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య దశనుండే శ్రీ శ్రీనివాస్ రామానుజన్ చదువులో ముందజలో ఉండేవారని మరియు ఉపాధ్యాయులు నిర్దేశించిన విషయాలను తప్పనిసరిగా పాటించి విద్యలో నూతన ఒరవడికి నాంది పలికిన మహానియుడని కొనియాడారు . ప్రస్తుత యువత మరియు విద్యార్థి సమాజం వారిని స్పూర్తిగా తీసుకొని శ్రమించే విధానాన్ని మార్చుకొని ఘనవిజయాల వైపు పయనించేదందుకు ప్రయత్నించి విజయవంతులు కావాలని కోరారు . ఉపాధ్యాయుల సలహాలు సూచనలు క్రమం తప్పకుండా పాటించి అభ్యసిస్తున్న విషయాల్లో నాణ్యతను పెంపోదించాలని .. సూచించారు . ప్రస్తుత ప్రపంచం చాలా పోటితో ఉన్నదని మరియు విభిన్నంగా , సృజనాత్మకంగా ఆలోచించే వారే అగ్రగామిగా ఉంటారని తెలియజేసారు . గణితశాస్త్రం పట్ల పట్టు సాధింపచేయడానికై మరియు భవిష్యతులో నిర్వహించే పోటీ పరీక్షలను సులభతరం చేయడానికై 10 వ తరగతి విద్యార్థులకు ఈ నెల 12 వ తేదిన అనగా ఆదివారం రోజున ఉదయం 10.00 నుండి 11.00 వరకు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ఆల్ఫోర్స్ విద్యాసంస్థలో గణిత ఆధారిత పరీక్షను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు . ఈ పరీక్ష తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద గణిత ఆధారీత పరీక్ష అని చెప్పారు . ఇట్టి సదావకాశాన్ని 10 వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోని గణితశాస్త్రం పట్ల పట్టు సాధించే విధంగా పయనించాలని కోరారు . ఈ పరీక్షలో అత్యుత్తమంగా ప్రదర్శించిన వారికి మరియు అత్యధిక మార్కులు సాధించిన వారికి 22 వ డిసెంబర్న అట్టహాసంగా నిర్వహింపబడే ఆల్ఫోర్స్ గణితఫ్ట్ అతిధుల చేతులమీదుగా ఘనంగా సన్మానించడం జరుగుతున్నదని చెప్పారు . మరిన్ని వివరాలకు 9160294441 , 9398230614 మరియు 9246934441 నందు సంప్రదించగలరని చెప్పారు . ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కళాశాలల ప్రిన్సిపాల్స్ , అధ్యాపకులు , ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు .

# ఎంఎస్ఎంఈల కోసం కొత్త అర్హత ప్రమాణాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2:ప్రభుత్వం నోటిఫికేషన్ నెం. ఎస్.ఓ. 26.06.2020 తేదీ నాటి ప్లాంట్ మరియు మెషినరీ లేదా పరికరాలలో పెట్టుబడి మరియు ఎంటర్‌ప్రైజెస్ టర్నోవర్ ఆధారంగా ఎంఎస్ఎంఈల వర్గీకరణకు సంబంధించిన వివిధ ప్రమాణాలను తెలియజేసింది. ఎంఎస్ఎంఈ కోసం ఉద్యం నమోదు ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్, డిజిటల్, పేపర్‌లెస్ మరియు స్వీయ-ఆధారితంగా చేయడం ద్వారా సరళీకృతం చేయడం బడింది.

మైక్రో, స్మాల్ మరియు మీడియం ఎంటర్‌ప్రైజ్‌గా నమోదు చేసుకోవడానికి ఎటువంటి పత్రాలు లేదా రుజువులు అప్‌లోడ్ చేయవలసిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ మరియు పాన్ అవసరం. పెట్టుబడి మరియు సంస్థల టర్నోవర్‌పై పాన్ , జీఎస్టీఐఎన్ లింక్ చేయబడిన వివరాలు సంబంధిత ప్రభుత్వ డేటాబేస్‌ల నుండి స్వయంచాలకంగా తీసుకోబడతాయి. ఎగుమతులకు సంబంధించి టర్నోవర్ ఎంఎస్ఎంఈల ఏ వర్గానికైనా టర్నోవర్ పరిమితుల్లో లెక్కించబడదు. కొత్త ప్రమాణాలు 01.07.2020 నుండి అన్ని రాష్ట్రాలు/యుటిలకు వర్తిస్తాయి. ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రోత్సహించడం మరియు అభివృద్ధి చేయడం అనేది రాష్ట్రాల అంశం. టైర్ 2 మరియు టైర్ 3 నగరాలతో సహా దేశంలోని ఎంఎస్ఎంఈల ప్రమోషన్, అభివృద్ధి మరియు పోటీతత్వాన్ని పెంచడం కోసం వివిధ పథకాలు కార్యక్రమాలు మరియు విధాన కార్యక్రమాల ద్వారా రాష్ట్ర/కేంద్రపాలిత ప్రభుత్వాల ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుంది.

ఈ రోజు లోక్‌సభలో కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రి శ్రీ నారాయణ్ రాణే లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని అందించారు.

# ప్రిన్సిపాల్‌కు డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేసిన అంబేద్కరిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 2 (నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లా యంగ్ మెన్స్ అంబేద్కరిస్ట్ అసోసియేషన్ వారిఆధ్వర్యంలో వేములవాడ రెండో బైపాస్ ఎస్సీ మహిళ గురుకుల పాఠశాల లో ఆ ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటం,అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని యంగ్ మెన్స్ అంబేద్కరిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొల్లం దేవరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో యంగ్ మెన్స్ అంబేద్కరిస్ట్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

# పై యాష్తో గని పునరుద్ధరణ : ఎంబీ పవర్




హైదరాబాద్, డిసెంబర్ 2:ఎంబీ పవర్ (మధ్యప్రదేశ్) లిమిటెడ్ (ఎంబీపీఎంఎల్) తమ అనుప్పూర్ థర్మల్ విద్యుత్ కేంద్రంలోని ప్లై యాష్ను వంద శాతం సుస్థిర పద్ధతిలో వినియోగించాలన్న నిబద్ధతపై మరొక అడుగు ముందుకు వేస్తూ సౌత్ ఈస్ట్రన్ కోల్ ఫీల్డ్ తో అవగాహన పత్రం (ఎంవోయు) పై మంగళవారం సంతకం చేసింది. ఈ ఎంవోయు కింద మధ్యప్రదేశ్ షాహ్డోల్ జిల్లాలోని వాడకం నిలిపివేసిన శారద ఓపెన్ క్యాస్ట్ గనిని ప్లై యాష్తో నింపే బాధ్యను ఎంబీ పవర్ తీసయకున్నది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి 2019 మార్చిలో జారీ చేసిన మార్గదర్శక సూత్రాల ప్రకారం ఎంపీసీబీ నిర్దేశించిన ప్రకారం, ఈ గనిని ప్లై యాష్తో నింపడం జరుగుతుంది.




Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com